సాక్షి
అనంతపురం

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023

I



చీనీ టన్ను రూ.24,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24,500 పలికాయి.



లక్ష్యం దిశగా మార్కెటింగ్ శాఖ

మార్కెటింగ్ శాఖ లక్ష్య సాధన దిశగా సాగుతోంది. జిల్లాలోని 9 మార్కెట్ యార్డులు 5 నెలల్లోనే 46 శాతం వసూళ్లు సాధించాయి.

IIలో

గరిష్టం/కనిష్టం
34.2°/ 22.5°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

అర్హులందరికీ పౌష్టికాహారం

- అంగన్‌వాడీలో నూతన సంస్కరణలు
- ఫేస్ యాప్ ద్వారా టీహెచ్ఆర్
- సంపూర్ణ పోషణ కిట్‌లో 10 రకాల సరుకులు
- గర్భిణులు, బాలింతల ఇబ్బందులను గుర్తించి ఇంటికే సరుకుల పంపిణీ





అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందుకుంటున్న లబ్ధిదారులు

రాయదుర్గం: మాతాశిశు సంరక్షణతో పాటు పూర్వ ప్రాథమిక విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. 'నాడు–నేడు' కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించి, సదుపాయాలు కల్పిస్తోంది. పూర్వప్రాథమిక విద్యనభ్యసించే మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలకు కేంద్రంలోనే మధ్యాహ్నం వేడివేడిగా పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేవారు. అయితే నెలలు నిండిన గర్భిణులు, ఇతర ఆరోగ్య సమస్యలున్న వారు కేంద్రాల వద్దకు రాలేక.. పౌష్టికాహారం తీసుకోలేక ఇబ్బందులు పడుతుండటాన్ని జగన్ సర్కారు గుర్తించింది. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కిట్లతో పాటు ఫోర్టిఫైడ్ బియ్యం, పాలు, కోడిగుడ్లు వంటివి టేక్ హోమ్ రేషన్ (టీహెచ్ఆర్) కింద ఇంటి వద్దకే ఇచ్చేలా కార్యాచరణ చేపట్టింది. సరుకుల పంపిణీలో అక్రమాలకు తావులేకుండా ఫేస్ (ముఖ ఆధారిత) యాప్ ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నారు. జిల్లాలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో నమోదైన గర్భిణులు, బాలింతలకు 15 కిలోల పరిమాణం కలిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్నారు. ఈ కిట్‌లో పది రకాల సరుకులు ఉంటాయి. నిర్ణీత పరిమాణంలో ప్యాక్ చేసి ఉండటంతో పక్కాగా లబ్ధిదారులకు అందుతున్నాయి.

నాడు అరకొర, నాణ్యతలేమి సరుకులు

టీడీపీ హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు పోషకాహార సరుకులు అరకొరగా వచ్చేవి. నిర్దిష్ట సమయానికి వచ్చేవి కాదు. ఎప్పుడు పడితే అప్పుడు వచ్చేవి. సరుకులు అందరికీ చాలక పోవడంతో లబ్ధిదారులు గొడవలకు దిగిన సందర్భాలూ ఉన్నాయి. దీనికి తోడు సరుకులు నాణ్యతగా ఉండేవి కావు.

నేడు అందరికీ 'సంపూర్ణ పోషణ'

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. మాతా, శిశు సంరక్షణతో పాటు గర్భిణులు, బాలింతలకు ఇంటికే పౌష్టికాహారం చేర్చే బృహత్తర కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చారు. లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా నాణ్యతతో కూడిన సంపూర్ణ పోషణ కిట్లతో పాటు నెలలో రెండు విడతలుగా పాలు, కోడిగుడ్లు ఇంటికే ఇచ్చే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహార కేంద్రాలుగా మారాయి.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	2,302
గర్భిణులు	16,756
బాలింతలు	14,178
3 - 7 ఏళ్లలోపు పిల్లలు	1,03,152

నెలకు పంపిణీ చేసే సరుకులు

బియ్యం	3 కిలోలు
కందిపప్పు	కిలో
అటుకులు	కిలో
రాగి పిండి	కిలో
పామాయిల్	500 ఎంఎల్
పాలు	2.5 లీటర్లు
బెల్లం	250 గ్రాములు
వేరుశనగ చిక్కీ	250 గ్రాములు
ఎండు ఖర్జూరం	250 గ్రాములు
కోడిగుడ్లు	25

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యమైన సరుకులు అందజేస్తున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యం కోసం సమతుల ఆహారం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలంతా రుణపడి ఉంటాం. పోషకాహారం మాలాంటి పేదలకు ఎంతో ఉపయోగపడుతోంది. రక్త హీనత నుంచి గట్టెక్కుతున్నాం.

– తిమ్మక్క, బాలింత, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

టీహెచ్ఆర్ విధానం బాగుంది



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే సరుకులన్నీ ముఖ ఆధారిత యాప్ ద్వారా పారదర్శకంగా పంపిణీ చేస్తున్నారు. సరుకుల్లో చాలా వరకు ప్రభుత్వమే ప్యాకింగ్ చేసి పంపింది. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా చేశారు. నాణ్యమైన పౌష్టికాహారం అందుతోంది. ఇంటికే సరుకులు (టీహెచ్ఆర్) పంపిణీ చేసే విధానం చాలా బాగుంది.

– శ్రీదేవి, గర్భిణి, ఓబుళాపురం, డీ హీరేహాళ్ మండలం

పారదర్శకంగా పంపిణీ

జిల్లా వ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ పారదర్శకంగా చేపట్టాం. ఫేషియల్ (ముఖ ఆధారితంగా) యాప్ ద్వారా లబ్ధిదారులకు అంగన్‌వాడీ సిబ్బంది అందిస్తున్నారు. కొన్ని సరుకులను ప్రభుత్వం ఈసారి ప్యాక్‌చేసి పంపింది. ప్రతి కిట్‌లోనూ పది రకాల పౌష్టికాహారం అందిస్తున్నాం.

– శ్రీదేవి, పీడీ, ఐసీడీఎస్

న్యూస్‌రీల్

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి



కానిస్టేబుల్ కిరణ్ భార్య అనితను పరామర్శిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొంది ఆత్మకూరులోని ఇంటికి వచ్చిన ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ భార్య అనితను ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని, ధైర్యంగా జీవించాలని భరోసా కల్పించారు. త్వరగా కోలుకుని పిల్లలను మంచి చదువులు చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, సీఐ నరేంద్రరెడ్డి, ఆర్ఐ రాముడు, ఎస్ఐ జనార్దన్, జిల్లా పోలీసుల అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పతనమైన టమాట ధర



అనంతపురం అగ్రికల్చర్: మార్కెట్‌లో టమాట ధరలు పతనమవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా, పక్కనున్న కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున సరుకు వస్తోంది. నెల కిందట కక్కలపల్లి మార్కెట్‌లో 500 టన్నులలోపు టమాటాలు రావడంతో గిట్టుబాటు ధరలు లభించాయి. ఇటీవల 2వేల నుంచి 5 వేల టన్నుల వరకు మార్కెట్‌కు వస్తుండటంతో అమ్మకాలు పూర్తిగా మందగించాయి. శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. కనిష్టం రూ.2, సరాసరిన రూ.5 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయన్నారు.

జిల్లాకు 2,254 మెట్రిక్ టన్నుల ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి అన్ని రకాల ఎరువులు జిల్లాకు సరఫరా అవుతున్నాయి. శుక్రవారం కూడా 2,254 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌లో జిల్లాకు చేరిన ఎరువులను ఆయన పరిశీలించారు. మహాధాన్ కంపెనీ నుంచి 594 మెట్రిక్ టన్నులు 20-20-0-13 రకం కాంప్లెక్స్, 237 మెట్రిక్ టన్నులు 24-24-0 రకం ఎరువులు వచ్చాయన్నారు. కోరమాండల్ కంపెనీ నుంచి 945 మెట్రిక్ టన్నులు 28-28-0-13 రకం, 478 మెట్రిక్ టన్నులు 20-20-0-13 850 రకం ఎరువులు వచ్చాయన్నారు.

15లోపు బయోమెట్రిక్ నమోదు చేయించాలి



అనంతపురం రూరల్: 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన మైనార్టీ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో ఈ నెల 15లోపు బయోమెట్రిక్ నమోదు చేయించేలా అన్ని చర్యలూ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను ఉమ్మడి అనంతపురం జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 9, 10 తరగతులతో పాటు ఇంటర్, డిగ్రీ, బీటెక్ విద్యార్థులు మైనార్టీ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, చాలా మంది విద్యార్థులతో ఇప్పటికీ బయోమెట్రిక్ నమోదు చేయించలేదని తెలిపారు. కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్ఈఓలు అన్ని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో పర్యటిస్తారని వారి సేవలను ఉపయోగించుకొని ఈ నెల 15లోపు విద్యార్థులతో వంద శాతం బయోమెట్రిక్ నమోదు చేయించి వివరాలను జిల్లా నోడల్ ఆఫీసర్ లాగిన్‌కు పంపిచాల్సిన బాధ్యత ప్రదానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లపై ఉందన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం



అటెండెన్స్‌ను పరిశీలిస్తున్న ఎంపీ రంగయ్య

పెద్దవడుగూరు : ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉద్యోగులు ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎంపీ తలారి రంగయ్య హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. శుక్రవారం మేడిమాకుపల్లి సచివాలయాన్ని ఎంపీ తనిఖీ చేశారు. అటెండెన్స్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. తొమ్మిది మంది ఉద్యోగులకు గాను ముగ్గురు మాత్రమే విధుల్లో ఉన్నారు. అటెండెన్స్‌లో మాత్రం ఐదుగురు హాజరైనట్లు సంతకాలు ఉండటాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులకు గైర్హాజరైన, సమయపాలన పాటించకుండా వస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నాగేశ్వరశాస్త్రి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చితంబరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాశం రంగస్వామి, కార్యదర్శి శేషారెడ్డి, బీసీ విభాగం మండల నాయకుడు వెంకటస్వామిగౌడ్, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అనంతపురం: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం ఉదయం పది గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇరువర్గాలకూ అంగీకారయోగ్యమైన, రాజీపడదగిన సివిల్, క్రిమినల్, ప్రీ–లిటిగేషన్ కేసులను సత్వర పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. సమగ్ర వివరాలకు 9440901044 నంబరును సంప్రదించాలని సూచించారు.

బాబుకే వారంటీ లేదు.. ప్రజలకు గ్యారంటీనా?

- గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఎద్దేవా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ప్రజా విశ్వాసం కోల్పోయిన టీడీపీ అధినేత చంద్రబాబుకే వారంటీ లేదు.. ఇక ఆయన ప్రజల భవిష్యత్తుకు ఏమి గ్యారంటీ ఇస్తాడని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఎద్దేవా చేశారు. బహిరంగ సభల ద్వారా జనాల్ని రెచ్చగొట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. శుక్రవారం ఆయన గుంతకల్లులోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గుత్తి బహిరంగసభలో సీఎం వైఎస్ జగన్‌పైన, తనపైన చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. అసెంబ్లీలో ఏ ఒక్కరూ మాట్లాడకపోయినా తన రాజకీయ ప్రయోజనాల కోసం మొసలికన్నీరు కార్చి తన భార్య పరువును బజారుకీడ్చిన నీచమైన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. చంద్రబాబు ఓ అవినీతి చక్రవర్తి అని, ఆయన్ని మించిన దోపిడీదారుడు దేశంలో ఎవ్వరూ లేరని విమర్శించారు.

ధైర్యముంటే గుంతకల్లులో పోటీచేసి గెలవాలి

చంద్రబాబుకు ధైర్యముంటే గుంతకల్లులో తనపై పోటీ చేసి గెలవాలని ఎమ్మెల్యే వైవీఆర్ సవాల్ విసిరారు. తాను ఓడిపోతే మీసం తీయించుకుని తిరుగుతానన్నారు. తను ఎలా గెలవాలో ముందు అది చూసుకుంటే చాలని చంద్రబాబుకు హితవు పలికారు. సేవాభావం, దాతృత్వగుణం, రాజకీయాల్లో క్రమశిక్షణ కలిగిన కుటుంబం కాబట్టే తనను, తన సోదరుల్ని ఆయా నియోజకవర్గాల ప్రజల ఆశీర్వదిస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దివంగత మహానేత వైఎస్సార్, దివంగత మాజీ ఎమ్మెల్యే ఎల్లారెడ్డి గారి భీమిరెడ్డి కుటుంబాల గురించి మరోసారి పిచ్చి కూతలు కూస్తే ఎందాకైనా వెళ్తామని హెచ్చరించారు. తమ మంచితనాన్ని, సహనాన్ని చేతకానితనంగా తీసుకోవద్దని హితవు పలికారు. తమది రాయల్ ఫ్యామిలీ అని, మట్టి, ఇసుక అమ్ముకుని బతకాల్సిన ఖర్మ పట్టలేదని స్పష్టం చేశారు. తాము అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. రెండెకరాల భూమి కలిగిన చంద్రబాబు నేడు వేల కోట్ల రూపాయల ప్రజా సొమ్మును దోపిడీ చేసి దాచుకున్నదంతా చార్టెడ్ ఫ్లైట్లలో విదేశాలకు వెళ్లి అక్కడ దాచిపెట్టిన విషయం యావత్ ప్రపంచానికీ తెలుసన్నారు. సీఎం జగన్ తన సొంత ఖర్చులతో లండన్‌లో ఉన్న తన కూతురు వద్దకు వెళ్తే నీకెందుకు నొప్పి? నీ సొమ్ము ఏమైనా ఇచ్చావా అని ఆయన మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. ప్రస్తుత అభివృద్ధి గురించి.. టీడీపీ హయాంలో జరిగినట్టుగా చంద్రబాబు చెప్పుకోవడాన్ని తప్పుపట్టారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీ ఆర్ మోహన్, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, మాజీ కన్వీనర్ ఎద్దుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులు

- విధుల్లో నిర్లక్ష్యం..
- లక్ష్యాల సాధనలో అలసత్వం
- సంజాయిషీ కోరిన పీఆర్ ఎస్ఈ



అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖలో ఐదుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(డీఈఈ), 223 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ప్రభుత్వ ప్రాధాన్యాలైన సచివాలయాలు, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాల పురోగతిలో వెనుకబడిన కారణంగా డీఈఈలు అరుణ్‌కుమార్ (ఉరవకొండ), మురళీధర్ (గుత్తి), రాజన్న (కళ్యాణదుర్గం), రామ్మోహన్‌రెడ్డి (రాయదుర్గం), రజనీకాంత్‌రెడ్డి (తాడిపత్రి)లకు పంచాయతీరాజ్ ఎస్ఈ యమ్మాని భాగ్యరాజ్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్యం, లక్ష్యాల పురోగతిలో అలసత్వం వహించిన జిల్లాలోని 223 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కూడా షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎస్ఈ తెలిపారు. లక్ష్యాలను సాధించడంలో ఎందుకు వెనుకబడ్డారో సహేతుక కారణాలతో వారంలోగా సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. లేకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమికి నివేదిక పంపారు.

12న జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం: జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికను ఈ నెల 12న నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శశికాంత్ తెలిపారు. నగరంలోని నీలం సంజీవరెడ్డి క్రీడా మైదానంలో అండర్–14, 16, 18, 20, 23 విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రాలతో 12వ తేదీ ఉదయం 7 గంటకు హాజరుకావాలని సూచించారు.

బీఎస్ఎఫ్ జవాన్ మృతి

గార్లదిన్నె: పెనకచెర్లడ్యాం గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ నారాయణస్వామి (31) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ సంఘటన జరిగింది. బెటాలియన్ నుంచి ఉదయం కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. జవాన్ తలకు, వీపు భాగంలో బుల్లెట్ గాయాలు ఉన్నాయి. అయితే విధి నిర్వహణలో కాల్పులు జరిగి చనిపోయారా.. ఇతరత్రా ఏమైనా కారణాలతోనా అనేది తెలియరాలేదు. నారాయణస్వామి 2012లో ఉద్యోగంలో చేరి 11 ఏళ్లపాటు సేవలందించారు. ఆయనకు భార్య శ్రీవాణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



నారాయణస్వామి (ఫైల్)

పంటల నమోదు వేగవంతం చేయండి

శింగనమల: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమా మహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం సోదనపల్లిలో పంటల నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ పంటల నమోదు పారదర్శకంగా చేయాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం 80 శాతం సబ్సిడీతో పెసర, ఉలవలు, కొర్ర, అలసంద విత్తనాలు అందిస్తున్నామన్నారు. పండిన తరువాత వాటిని మండల సమాఖ్య ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. పది రోజుల తరువాత మొక్కజొన్న విత్తనాలు సబ్సిడీపై అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్, ఏఈఓ అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.



సోదనపల్లిలో పంట నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉమా మహేశ్వరమ్మ

'భవిత'కు భరోసా

- ప్రత్యేక అవసరాల పిల్లలపై సర్కారు 'ప్రత్యేక' దృష్టి
- భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఐఈఆర్పీ పోస్టుల భర్తీకి చర్యలు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 42 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- ఈ నెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు



రాప్తాడు రూరల్: ప్రత్యేక అవసరాల పిల్లల భవితకు ప్రభుత్వం భరోసా ఇస్తోంది. భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక విద్య బోధిస్తున్నారు. ఇటీవలే భవిత కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లోకి విలీనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధారణ విద్యార్థులతో కలిసి ఉండడం వల్ల ప్రత్యేక అవసరాల పిల్లల్లో మరింత మార్పు వస్తుందనే ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక పిల్లలకు శిక్షణ ఇచ్చే ఇన్‌క్లూజిట్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ) పోస్టుల భర్తీపై దృష్టి సారించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 126 పోస్టులు ఉండగా... 84 మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఖాళీగా ఉన్న మరో 42 పోస్టుల భర్తీకి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఖాళీ పోస్టుల్లో 15 ఎంఆర్, 27 హెచ్ఐ/వీఐ పోస్టులు ఉన్నాయి. రోస్టర్‌ను అనుసరించి ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం 100 మార్కులతో మెరిట్ జాబితాను తయారు చేస్తారు. ఇందులో 85 మార్కులు ఇంటర్, డిగ్రీ, పీజీ, స్పెషల్ ఎడ్యుకేషన్, గతంలో ఐఈఆర్పీలు పని చేసి ఉంటే సర్వీసును పరిగణనలోకి తీసుకుని కేటాయిస్తారు. తక్కిన 15 మార్కులకు స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.

రాష్ట్రస్థాయిలోనే ఎంపిక

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను రాష్ట్రస్థాయిలో అధికారులు పరిశీలించి మెరిట్ జాబితా తయారు చేస్తారు. ఒక పోస్టుకు ఐదుగురు చొప్పున ఎంపిక చేసి ఆ జాబితాను ఈ నెల 23న జిల్లాలకు పంపుతారు. ఈ జాబితాపై ఈ నెల 25, 26 తేదీల్లో జిల్లా అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిన్నింటినీ పరిశీలించి 27న తుదిజాబితా తయారు చేస్తారు. 28 నుంచి 30 వరకు జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. అక్టోబరు 3 నుంచి 5 వరకు స్కిల్‌టెస్ట్ నిర్వహిస్తారు. 6న తుది ఎంపిక జాబితాను ప్రకటిస్తారు. 7న నియామక ఉత్తర్వులు అందజేస్తారు. 9, 10 తేదీల్లో కాంటాక్ట్ అగ్రిమెంట్ తీసుకుంటారు. 11న విధుల్లో చేరాల్సి ఉంటుంది.

ఇవీ విద్యార్హతలు

- సాధారణ బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఆర్‌బీఐ (రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) గుర్తింపుతో స్పెషల్ బీఈడీ చేసి ఉండాలి.
- లేదా సాధారణ బ్యాచిలర్ డిగ్రీతో పాటు జనరల్ బీఈడీ, ఏడాది డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి.
- లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు జనరల్ బీఈడీ, రెండేళ్ల డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఆర్‌సీఐ గుర్తింపు పొంది ఉండాలి.
- లేదా బ్యాచిలర్ డిగ్రీతో పాటు జనరల్ బీఈడీ, పీజీ ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఆర్‌సీఐ గుర్తింపు పొంది ఉండాలి.
- ఇంటర్‌తో పాటు డీఎడ్ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఆర్‌సీఐ నుంచి గుర్తింపు పొందిన ధ్రువపత్రం ఉండాలి.

పారదర్శకంగా పోస్టుల భర్తీ

ప్రత్యేక అవసరాల పిల్లల విద్య బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న ఐఈఆర్పీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 42 పోస్టులు భర్తీ చేస్తున్నాం. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రాష్ట్రస్థాయిలోనే ఎంపిక జాబితాను తయారు చేస్తారు. పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియను చేపట్టనున్నారు.

– వి.నాగరాజు సమగ్రశిక్ష ఏపీసీ

క్లుప్తంగా

హెచ్చెల్సీకి పైపింగ్



హెచ్చెల్సీకి పైపింగ్ పడి నీరు బయటకు వస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)కు బొమ్మనహాళ్ మండలం మైలాపురం సమీపంలోని 122–300 కిలోమీటర్ వద్ద శుక్రవారం చిన్నపాటి పైపింగ్ పడింది. దాదాపు 3 గంటల పాటు నీరు వృథాగా బయటికి వెళ్లాయి. హెచ్చెల్సీ ప్రధాన కాలువను పర్యవేక్షిస్తున్న సిబ్బంది గమనించి వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే హెచ్చెల్సీ అధికారులు అప్రమత్తమై పైపింగ్ పడిన ప్రదేశాన్ని గుర్తించి పైపింగ్‌ను పూడ్చివేశారు. కాలువపై మరోచోట పైపింగ్ పడకుండా కాలువ గట్లపై లస్కర్లతో ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు డీఈఈ మద్దిలేటి తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద 1800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుందని డీఈఈ తెలిపారు.

ఆర్టీసీలో విజిలెన్స్ రహస్య విచారణ

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీలో కడప జోన్ విజిలెన్స్ అధికారులు రహస్య విచారణ చేపట్టారు. శుక్రవారం విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ రహిమాన్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగింది. ఆర్ఎం కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అధికారులకు ఇటీవల ఫిర్యాదులు వెళ్లాయి. ఫిర్యాదులను స్వీకరించిన అధికారులు శుక్రవారం జిల్లాకు వచ్చారు. అభియోగాలు వచ్చిన పలు సెక్షన్లలో రికార్డులు పరిశీలించి అధికారులను విచారించారు. అయితే ఈ విషయం బయటకు రాకుండా జాగ్రత్తలు పడ్డారు. విజిలెన్స్ అధికారులు కూడా సమాచారం ఇవ్వలేదు. దీనిపై ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోనిని వివరణ కోరగా... ఏపీఎస్ ఆర్టీసీలో ఇలాంటివి సర్వసాధారణమని, ఎవరో ఒకరు ఆకాశరామన్న ఉత్తరాలు రాస్తుంటారని తెలిపారు. దీనిపై విజిలెన్స్ విభాగం అధికారులు విచారించి వెళ్లారని వివరించారు.

భద్రత మధ్య ఈవీఎంల స్కానింగ్

అనంతపురం అర్బన్: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన విధంగా హైదరాబాద్, ఘజియాబాద్‌కు ఈవీఎంలను తరలించేందుకు అవసరమైన చర్యలను జిల్లా ఎన్నికల యంత్రాంగం వేగవంతం చేసింది. స్థానిక టవర్ క్లాక్ సమీపంలోని ఆర్డీఓ పాత కార్యాలయం ఆవరణలోని గోదాములో భద్రపరిచిన ఈవీఎంల స్కానింగ్ ప్రక్రియను పోలీసు బందోబస్తుతో సీసీ కెమెరాల నిఘా మధ్య సిబ్బంది నిర్వహిస్తున్నారు. స్కానింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత 22,101 ఈవీఎంలను ప్రత్యేక కంటైనర్‌లో నిర్దేశించిన ప్రాంతాలకు తరలిస్తారు.

లక్ష్యం దిశగా మార్కెట్‌యార్డులు

- శింగనమల, అనంతపురం మార్కెట్ల దూకుడు
- గుత్తి, గుంతకల్లు, రాప్తాడు మార్కెట్లు వెనుకంజ
- ఓవరాల్‌గా 46 శాతంతో రూ.4.93 కోట్ల వసూళ్లు



అనంతపురం వ్యవసాయమార్కెట్ యార్డులో చీనీ క్రయ విక్రయాల దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్‌శాఖ ఆదాయ వనరులు పెంచుకుంటోంది. నిర్దేశిత లక్ష్యసాధన దిశగా మార్కెట్‌యార్డులు ముందుకు సాగుతున్నాయి. గతేడాది మాదిరిగా ఈ సారి కూడా వందశాతం లక్ష్యాన్ని సులువుగా చేరుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే జిల్లాలో ఉన్న 9 మార్కెట్ కమిటీల్లో కొన్నింట వివిధ పన్నుల వసూళ్లు మెరుగ్గా ఉండగా మరికొన్ని బాగా వెనుకబడ్డాయి. మొత్తంగా పరిస్థితి మెరుగ్గా కనిపిస్తోంది. ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరంలో మార్కెటింగ్‌శాఖ రూ.10.81 కోట్లు వసూళ్ల లక్ష్యం నిర్దేశించుకోగా... ఐదు నెలలు అంటే ఆగస్టు చివరకు 46 శాతంతో రూ.4.93 కోట్లు సాధించింది. గతేడాది ఇదే సమయంతో పోల్చితే రూ.74 లక్షలు అధికంగా వసూలు కావడం విశేషం.

శింగనమల, అనంత ముందంజ

వివిధ పన్నులు, ఆదాయం పెంచుకోవడంతో శింగనమల ఇప్పటికే 65 శాతంతో రూ.75 లక్షలకు గానూ రూ.49 లక్షల వసూళ్లు సాధించింది. ఆ తర్వాత అనంతపురం మార్కెట్‌యార్డు కూడా 60 శాతంతో రూ.4.10 కోట్లకు గానూ రూ.2.44 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 48 శాతంతో ఉరవకొండ, 40 శాతంతో కళ్యాణదుర్గం, 38 శాతంతో తాడిపత్రి, 31 శాతంతో రాయదుర్గం కమిటీలు ఫరవాలేదన్నట్లు కనిపిస్తున్నాయి. అయితే కేవలం 19 శాతం వసూళ్లతో గుంతకల్లు అట్టడుగున ఉండగా ఆ తర్వాత 23 శాతంతో గుత్తి, 25 శాతంతో రాప్తాడు మార్కెట్ కమిటీలు వెనుకబడ్డాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు 9 కమిటీలు వందశాతం లక్ష్యం సాధించేలా చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్‌శాఖ ఏడీ పీ.సత్యనారాయణచౌదరి తెలిపారు. యార్డులు, చెక్‌పోస్టుల్లో లోటుపాట్లను సవరించి విజిలెన్స్ చర్యలు పటిష్టం చేస్తామని తెలిపారు.

బహిరంగ చర్చకు సిద్ధమా బాబూ?

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: గుత్తి బహిరంగ సభలో చంద్రబాబు తనపై తన సోదరులపై చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలి. ఆరోపణలు నిజమని తేలితే రాజకీయ సన్యాసం తీసుకుంటా, అవి అవాస్తవాలని రుజువు అయితే రాజకీయాలకు శాశ్వతంగా గుడ్‌బై చెప్పే దమ్ము ఉందా చంద్రబాబు' అని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి పదవి కోసం దొడ్డిదారిన సొంతమామనే వెన్నుపోటు పొడిచి చంద్రబాబులా రాజకీయాలు చేయలేదని, తన తండ్రి కాలం నుంచే ప్రజాసేవ చేయడానికి తనతో పాటు తన సోదరులు కష్టపడుతున్నారని తెలిపారు. గుత్తి బహిరంగ సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్సీ శివరామిరెడ్డితో పాటు వారి సోదరులపై చేసిన వాఖ్యలను శుక్రవారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ నుంచి ఫోన్‌లో ద్వారా 'సాక్షి'తో మాట్లాడారు. తనపై తన సోదరుల పై నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని చంద్రబాబుకు హెచ్చరించారు. తమకు చెందిన వందలాది ఎకరాలు సీలింగ్‌లో పోయినా బాధపడకుండా ప్రజాసేవలో ఉంటూ ప్రజలచేత మన్ననలు పొందిన నాయకులుగా గుర్తింపు పొందామన్నారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. తన సోదరుడు మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మూడు సార్లు ప్రజలచే ఎన్నుకోబడ్డారన్నారు. వై.సాయిప్రసాద్ రెడ్డి రెండు సార్లు ఆదోని నియోజకవర్గం నుంచి, మరో సోదరుడు వై. వెంకట్రామిరెడ్డి గుంతకల్లు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేలుగా గెలుపొందారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమ కుటుంబంపై ఎంతో నమ్మకంతో తమ సోదరుడు వై.సీతారామిరెడ్డికి టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించారన్నారు.

చంద్రబాబు అబద్ధాల కోరు

- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: 'అభివృద్ధినంతా చేసింది తానేనంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ఉత్తుత్తి గొప్పలు చెప్పుకుంటున్నారు. ప్రజలు ఆయన మాటలను నమ్మే పరిస్థితిలో లేరు. అబద్ధాల కోరు చంద్రబాబు' అని విమర్శించారు ఉరవకొండ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి. శుక్రవారం మండల పరిధిలోని జీడిపల్లిలో పార్టీ ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నారా చంద్రబాబు కేవలం అబద్ధాలు చెప్పి జనాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ప్రాజెక్టుల గురించి మాట్లాడే చంద్రబాబు రాయలసీమ జిల్లాల శాశ్వత కరువు నివారణ ప్రాజెక్టు అయిన హంద్రీనీవాను కేవలం ఐదు టీఎంసీల ప్రాజెక్టుగా చేసి ప్రారంభోత్సవానికే పరిమితం చేసి ఇప్పుడు హంద్రీనీవా ప్రాజెక్టు మొత్తం తానే చేశారని ఆర్భాటంగా చెబుతూ సెల్ఫీలు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. హంద్రీనీవాను ఐదు నుంచి 40 టీఎంసీల ప్రాజెక్టుగా మార్చి జీఓ విడుదల చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. బాబు హయాంలో విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారని, అందుకే రూ.118 కోట్ల ఐటీ స్కాంలో నోటీసులు కూడా అందుకున్నారని తెలిపారు. అరెస్టు భయంతో చంద్రబాబు మానసిక రోగిగా మారుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా విశ్వాసం లేని చంద్రబాబుకు ప్రతిపక్షనాయకుడిగా కొనసాగే అర్హత లేదన్నారు. సమస్యలన్నీ అధిగమించి జీడిపల్లి గ్రామానికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద దాదాపు రూ.85 కోట్ల మేర నిధులు విడుదలకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

'దిశ'తో సత్వర న్యాయం!

- ఫిర్యాదు అందిన నిమిషాల వ్యవధిలోనే రంగంలోకి..
- బాధిత కుటుంబ సభ్యులకు పోలీసుల బాసట



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తమ కూతురు కనిపించడం లేదని తల్లిదండ్రులు దిశ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గంటల వ్యవధిలోనే యువతిని గుర్తించారు. ఈ సంఘటన అనంతపురం ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.

మంగళూరులో ఉన్నట్లు గుర్తింపు

నగరంలోని సదానగర్‌లో నివాసం ఉండే రామకృష్ణ అనే వ్యక్తి తన కుమార్తె కనిపించడం లేదని దిశకు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకున్న వన్‌టౌన్, దిశ పోలీసులు బాధితుల నుంచి వివరాలు సేకరించారు. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం యువతి స్నేహితులను, చుట్టుపక్కల వారిని, బంధువులను పోలీసులు విచారించారు. గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఒక యువకుడి బైక్‌పై యువతి వెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో అజ్ఞాత వ్యక్తి ఎవరు? అనే కోణంలో పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. యువతిని బైక్‌పై తీసుకెళ్లిన యువకుడు ఓంప్రకాష్‌గా పోలీసులు గుర్తించారు. సెల్‌ఫోన్ టవర్ లొకేషన్, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. యువతి, యువకుడు మంగళూరు దగ్గర ఉన్నట్లు టెక్నికల్ టీం గుర్తించింది. వెంటనే యువతి తల్లిదండ్రులకు సమాచారం అందించి, వీలైనంత త్వరగా అమ్మాయిని అప్పగిస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. తమ కుమార్తె కనిపించడం లేదని దిశ యాప్‌కు కాల్ చేసిన వెంటనే తక్షణం స్పందించిన పోలీసులకు యువతి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు, లోకేష్‌ను అరెస్టు చేయాలి

- రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడమే వారి ధ్యేయం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



తాడిపత్రి: 'టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ కిరాయి మూకలతో దాడులకు తెగబడుతూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. వెంటనే వారిద్దరినీ అరెస్టు చేయాలి' అని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు ఘటనల్లో చల్లా బాబు, భీమవరం ఘటనల్లో చింతమనేని ఆధ్వర్యంలో టీడీపీ కిరాయి గుండాలు దాడులకు దిగారన్నారు. అక్కడ చంద్రబాబు కనుసన్నల్లో, ఇక్కడ తనయుడు లోకేష్ ప్రోద్బలంతోనే అల్లరి మూకలు దాడులకు తెగబడ్డాయన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రలో సంఘ విద్రోహ శక్తులు, రౌడీ షీటర్లు ఉన్నారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి రౌడీ షీటర్లను తెచ్చి దాడులు చేయిస్తున్నారన్నారు. లా అండ్ ఆర్డర్‌ను అమలు చేస్తున్న పోలీసులపైనే రెండు సంఘటనల్లో దాడులు చేసి, వారి రక్తం కళ్ల చూశారన్నారు. అయితే ఎక్కడా వారు సంయమనం కోల్పోలేదన్నారు. పక్కా ప్లాన్ ప్రకారం చంద్రబాబు, లోకేష్ పచ్చ కిరాయి మూకలతో సామాన్య ప్రజలతో పాటు పోలీసులపై దాడులు చేయిస్తే దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర చీఫ్ పురంధేశ్వరి, కమ్యూనిస్టు పార్టీలు ఖండించకపోవడానికి కారణాలు ఏమిటో ప్రజలు గుర్తించాలన్నారు. యాత్రల పేరుతో చంద్రబాబు, లోకేష్‌లు ప్రాంతాల మధ్య విద్వేషాలను రగిలిస్తున్నారని విమర్శించారు. వీధి రౌడీలు కూడా మాట్లాడని భాషను నారాసురులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు మంత్రులను బూతులు తిడుతున్నారన్నారు. అధికారం కోసం రాష్ట్రాన్ని తగులబెట్టాలని చూస్తున్న చంద్రబాబు, లోకేష్‌లపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడంతో పాటు పార్టీ ముసుగులో ఉన్న రౌడీషీటర్లు, గుండాలను గుర్తించి పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి డిమాండ్ చేశారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి



అర్జీలను స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే అర్జీలకు తప్పనిసరిగా అధికారులు పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ కేతన్‌గార్గ్, ఆర్డీఓ మధుసూదన్ హాజరయ్యారు. జేసీ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా జిల్లా స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాల్లో ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను మండలస్థాయిలోనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుల్‌రెడ్డి, స్పందన తహసీల్దార్ వాణిశ్రీ, హార్టికల్చర్ డీడీ రఘునాథ్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, డీఎస్‌ఓ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నియంత్రణకు కృషి చేయాలి

- ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సుజాత



5కే మారథాన్ రన్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సుజాత

అనంతపురం క్రైం: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత పిలుపునిచ్చారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 5కే మారథాన్‌ను ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు, జెడ్పీ ఆఫీసు, ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా ఆర్ట్స్ కళాశాల వరకు సాగింది. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సుజాత, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి అనుపమ జేమ్స్ మాట్లాడుతూ అరక్షిత లైంగిక సంపర్కం, హెచ్‌ఐవీ ఉన్న తల్లి నుంచి బిడ్డకు, హెచ్‌ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీలు, కలుషిత రక్తమార్పిడి ద్వారా మాత్రమే హెచ్‌ఐవీ సంక్రమిస్తుందన్నారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వ్యక్తితో కలసి జీవించినా, భోజనం చేసిన, మరుగుదొడ్లు, దోమకాటు ద్వారా హెచ్‌ఐవీ సంక్రమించదన్నారు. మారథాన్ విజేతలు రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, అందులో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులను అందజేస్తారన్నారు. ఈ మారథాన్‌లో 88 మంది యువకులు పాల్గొనగా ఆర్ట్స్ కళాశాలకు చెందిన డీ నవీన్ మొదటి, శ్రీకాంత్ రెండో, సత్యమయ్య మూడో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ రంగనాథ్, ఆర్ఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ గిరిధర్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం యం వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వజ్రాన్వేషణ

ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామ పొలాల సమీపంలో రెండు రోజుల క్రితం వర్షం కురిసింది. చిగిచెర్ల గ్రామానికి చెందిన కొందరికి వజ్రాలు దొరికాయన్న వార్తలతో అనంతపురం, ధర్మవరం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున అక్కడి వెళ్లి పొలాల్లో వజ్రాల కోసం అన్వేషణ సాగిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు, దొరికిన రంగు రాళ్లను భద్రపరుస్తున్న మహిళ

ఏపీ అండర్-19 జట్టుకు ఆర్షియా ఎంపిక



అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎస్. ఆర్షియా ఏపీ అండర్-19 జట్టుకు ఎంపికైంది. కదిరి పట్టణానికి చెందిన ఆర్షియా కుడి చేతి ఓపెనర్ బ్యాటర్‌గా రాణిస్తున్నారు. ఆర్షియా ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఆంధ్రా సౌత్ జోన్ టీంలో అర్ధ సెంచరీ, జిల్లా స్థాయి పోటీల్లో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో సెప్టెంబర్ 10 నుంచి 20వ తేదీ వరకు ఆరు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో పాల్గొననున్నారు. కదిరి క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో కోచ్ నజీర్ అహమ్మద్ పర్యవేక్షణలో శిక్షణ తీసుకుంటున్నట్లు ఆర్షియా తెలిపారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరుపున ఎస్. ఆర్షియాకు యుగంధర్‌రెడ్డిని అసిస్టెంట్ క్రికెట్ కోచ్‌గా నియామించినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కే. మధు ఆచారి తెలిపారు.

రైలు కింద పడి ఇద్దరి ఆత్మహత్య





మృతుడు జింక గురుప్రసాద్ (ఫైల్), మృతుడు రవి

తాడిపత్రి: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. తాడిపత్రి పరిధిలోని వంగనూరు గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై జింక గురునాథ్ (25) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే జీఆర్పీ సీఐ నాగేష్ బాబు తెలిపారు. తాడిపత్రి, జీపీపీ కాలనీకి చెందిన జింక గురునాథ్ తండ్రి గురుప్రసాద్ కొద్ది సంవత్సరాల క్రితం మరణించాడన్నారు. అప్పటి నుంచి గురునాథ్ మానసిక వేదనతో బాధపడుతున్నాడని చెప్పారు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

గుత్తి దగ్గర కర్ణాటక వాసి...

గుత్తి: గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వే యార్డు సమీపంలో శుక్రవారం కర్ణాటక వాసి రవి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలమేరకు.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా అడ్కి తాలూకా సేదం గ్రామానికి చెందిన రవి (26) బెంగళూరులో ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. అయితే ఉన్న ఫలంగా తురకపల్లి రైల్వే యార్డు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించారు. రవి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ రేషన్ బియ్యం

పామిడి: పామిడిలో అక్రమంగా తరలివెళ్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. 44వ నంబర్ జాతీయ రహదారిపై సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని సొరకాయలపేట, వంకరాజుకాలువ గ్రామాల నుంచి ఆటోలో అక్రమంగా తరలివెళ్తున్న బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 16 ప్యాకెట్ల బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేశారు. కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన బోయ సురేష్, గార్లదిన్నె మండలం కేశవాపురానికి చెందిన ఆటో డ్రైవర్ రమేష్‌ను అరెస్ట్ చేశారు.

ఆర్టీసీ డిపోల్లో షాపులకు టెండర్లు

డిపోల వారీగా ఖాళీగా ఉన్న షాపులు, స్థలాలు

డిపో	షాపులు	స్థలాలు
అనంతపురం	6	8
గుంతకల్లు	3	16
కళ్యాణదుర్గం	6	19
రాయదుర్గం	3	10
తాడిపత్రి	4	12
ఉరవకొండ	3	7

అనంతపురం సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లో ఖాళీగా ఉన్న షాపులు, ఓపెన్ స్థలాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12లోగా దరఖాస్తు ఫారాలు తీసుకోవాలని 13న ఆర్ఎం కార్యాలయంలో టెండర్లు స్వీకరణ, ఖరారు చేస్తామన్నారు.

టపాకాయల విక్రయ లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అర్బన్: దీపావళి పండుగను పురస్కరించుకుని టపాకాయల విక్రయానికి తాత్కాలిక లైసెన్స్ పొందే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఆర్‌ఓ గాయత్రిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి అక్టోబర్ 1వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత ఏడాదికి దరఖాస్తు చేసుకుని లైసెన్స్‌లు పొందే వారు మాత్రమే టపాకాయల విక్రయానికి అర్హులన్నారు.

రూ.500 చలానా చెల్లించాలి

దరఖాస్తు ఫారం www.peso.gov.in వెబ్‌సైట్‌లో లభిస్తుందని డీఆర్‌ఓ తెలిపారు. దరఖాస్తుతో పాటు ఏదైనా నివాస ధ్రువీకరణపత్రం, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రూ.500 చలానాను www. cfms. ap. gov. in లోకి వెళ్లి నిర్దేశించిన హెడ్‌ఆఫ్ అకౌంట్స్‌కు జమ చేయాలన్నారు. పూరించిన దరఖాస్తులను (నాలుగు సెట్లు) కలెక్టర్ కార్యాలయంలోని సీ–4 సహాయకులకు ఈనెల 11 నుంచి అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని సూచించారు.

క్లుప్తంగా

ఎన్‌క్యాప్ నిధులతో అభివృద్ధి పనులు



వైద్య కళాశాల ఎదుట అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలో ఎన్‌క్యాప్ నిధులు రూ.13 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మేయర్ వసీం తెలిపారు. నగరంలోని వైద్య కళాశాల ఎదుట ఎన్‌క్యాప్ నిధులు రూ.10 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఫుట్‌పాత్‌తో పాటు పేవర్ బ్లాక్ పనులను మేయర్ వసీం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సూర్యనగర్ సర్కిల్‌లో రూ.1.98 కోట్లు, ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.50 లక్షలతో మల్టీ లెవెల్ పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. కార్పొరేటర్లు మల్లెమీద నరసింహులు, అనిల్‌కుమార్ రెడ్డి, సైఫుల్లాబేగ్; నాయకులు ఖాజా, ఈఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు



రాధాపార్థసారధులకు అభిషేకాలు చేస్తున్న ఇస్కాన్ నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: స్థానిక ఇస్కాన్ మందిరంలో మూడురోజుల పాటు వైభవంగా జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఇస్కాన్ సంస్థాపకాచార్యులు భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాదుల వారి ఆవిర్భావ సందర్భాన్ని పురస్కరించుకొని మందిరంలో పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామికి పవిత్రజలాలతో అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు, శ్రీల ప్రభుపాదుల ఆవిర్భావ దినోత్సవ ప్రాముఖ్యతపై ప్రవచనం,మహా మంగళహారతి నిర్వహించిన అనంతరం అన్నదాన సంతర్పణ జరిగింది.

ఘనంగా చివరి శ్రావణ శుక్రవార పూజలు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో శ్రావణమాసంలో వచ్చిన చివరి శుక్రవారం పూజలు పెద్దఎత్తున నిర్వహించారు. ఆర్‌ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గత జూన్ నెల నుంచి 50 రోజుల పాటు నిర్విరామంగా సాగిన మహాలక్ష్మి పూజల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని 108 కేజీల తేనెతో అభిషేకించారు. అనంతరం భక్తులకు ప్రసాదంగా అందించారు. కమలానగర్‌లోని సద్గురు రాజ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారి 93వ జయంతి వేడుకలు జరిగాయి. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిగాయి. చెరువుకట్టపై వెలసిన నిముషాంబాదేవి, సాయినగర్‌లో వెలసిన కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.


పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ

రాప్తాడురూరల్: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ తెలిపారు.శుక్రవారం అనంతపురం రూరల్ ప్రాజెక్టు పరిధిలోని రాజీవ్‌కాలనీ–2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపర్‌వైజర్ మాట్లాడుతూ అందుబాటులో ఉన్న కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పాలు, కోడిగుడ్లతో పాటు సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తహీనతను అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ కాలనీ, నేతాజీకాలనీ, భగత్‌సింగ్‌నగర్, ప్రియాంక కాలనీ అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, గంగావతి, షాను, సాబీరాబేగం, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు



పంట కోత ప్రయోగాలు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరు గ్రామ సమీపంలో శుక్రవారం వ్యవసాయ అధికారులు పంట కోత ప్రయోగాలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ తప్పకుండా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏడీఏ రవి సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత, పంపనూరు సర్పంచ్ ఎర్రిస్వామి, ఏఎస్‌ఓ మమత, తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: 'గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సభ్యులు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు, పచ్చ కండువాలు కప్పుకునే వారికే పథకాలు అందేవి.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పార్టీలు, కులమతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అనంతపురం రూరల్ మండలం విద్యారణ్యనగర్ లో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు లబ్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అధికారులు ఎవరైనా లంచం అడుగుతున్నారా? అని ఆరాతీశారు. ఎవరికీ రూపాయి కూడా లంచం ఇవ్వలేదని, వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి అన్నీ పత్రాలు తీసుకెళ్లి పథకాలు వచ్చేలా చేస్తున్నారని మహిళలు ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించడమే తమ లక్ష్యమన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుజ్జల వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, మౌనిక మండల కన్వీనర్ పవన్‌కుమార్, నాయకులు మాదన్నయాదవ్, ఆకుల మునిశంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గ్లోబల్ లీడర్స్‌గా మారాలి

ఆత్మకూరు: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేశామని, విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని గ్లోబల్ లీడర్లుగా ఎదగాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా నాబార్డు కింద రూ.1.24 కోట్లు నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న విద్యారంగానికి పెద్ద పీట వేశారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. గోరుముద్ద ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న విద్యాకానుకలు అందించామన్నారు. అమ్మ ఒడితో విద్యార్థుల చదువుకు చేయూతనిచ్చినట్లు తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంపై తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో సరదాగా ఎమ్మెల్యే సెల్ఫీలు దిగారు. బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే: ఇటీవల వడ్డుపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన సురేష్‌రెడ్డి, ఓబుళరెడ్డి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగింది అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. అనంతరం వార్డు మెంబర్ వేణుగోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు ధనుంజయ యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత ,సర్పంచ్ వరలక్ష్మి, వైస్ సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్, గ్రామ సచివాలయాల కన్వీనర్ నరసింహారెడ్డి, మండల కన్వీనర్ బాల పోతన్న , యూత్ కన్వీనర్ కొండారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వాసుదేవరెడ్డి, మల్లన్న, వన్నూరప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, అతిక్‌రెడ్డి, తహసీల్దార్ షర్మిల, ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తరిమెల అమరనాథరెడ్డి రచనా శైలి విభిన్నం



తరిమెల అమరనాథరెడ్డి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

అనంతపురం కల్చరల్: ప్రజలతో జరిగిన అనుభవాలను చక్కటి కథనాలు, కవితలుగా మలిచే తరిమెల అమరనాథరెడ్డి రచనాశైలి విభిన్నంగా ఉంటుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లాకు చెందిన రచయిత తరిమెల అమరనాథరెడ్డి రచించిన 13వ పుస్తకం 'టైం పాస్' పుస్తకాన్ని తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరిమెల అమరనాథరెడి రక్తదాతగా ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులను ప్రభావితం చేస్తున్నారన్నారు. ఆయన రచనల్లో సామాజిక స్పృహ, నైతిక విలువలు ఉంటాయన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను వారి ముంగిటకే తెస్తోందన్నారు. ఇందులో తప్పొప్పులను రచయితలు ప్రజలు, ప్రభుత్వాలకు వారధిగా ఉండేలా చెప్పాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టి, మరోసారి ప్రజల విశ్వాసాన్ని చూరగొంటామన్నారు. మానవతా రక్తదాతల సంస్థ కో కన్వీనర్ సలీం మాలిక్, స్కిల్ డెవలప్‌మెంట్ అడ్వైజర్ మధుసూదనరెడ్డి, నవరత్నాలు రాష్ట్ర వైస్ చైర్మన్ నారాయణమూర్తి, కామ్రేడ్ సాంబిరెడ్డి జానీప్రసాద్, అరుణ, వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గీతాపఠనంతో సమస్యల నుంచి సాంత్వన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

అనంతపురం కల్చరల్: భగవద్గీత పఠనంతో సకల సమస్యల నుంచి సాంత్వన కలుగుతుందని వక్తలు పేర్కొన్నారు. వివేకానంద యోగకేంద్రం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సాగే భగవద్గీత శిబిరం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక రెవెన్యూ కాలనీలోని కోదండరామాలయంలో బీఎస్‌ఎన్‌ఎల్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో జరిగిన తొలిరోజు కార్యక్రమానికి చిన్మయామిషన్ ఇన్‌చార్జ్ ఆత్మవిదానంద సరస్వతీ స్వామీజీ, టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వర్థనాయక్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. ఈనెల 14 వరకు సాగే భగవద్గీత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కేరళకు చెందిన ఆనందాశ్రమం మాతాజీ స్వామిని చంద్రానంద భగవద్గీత పారాయణ విశిష్టతను తెలిపారు. 18 అధ్యాయాలలోని విశేషాలను ప్రతిరోజు నేర్పిస్తామన్నారు.

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో శుక్రవారం నాగుల విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. గతంలో నాగులకట్ట వేపచెట్టు కింద ఉన్నందున విగ్రహాలు అడుగున పడి వర్షపు నీటితో మునిగే పరిస్థితి ఉండేది. దీంతో నూతనంగా నాగులకట్ట ఏర్పాటు చేసి శుక్రవారం విగ్రహ ప్రతిష్ట చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

వృద్ధుడి ఆచూకీ లభ్యం

అనంతపురం సిటీ: నగరంలోని రాంనగర్ రైల్వే గేటు సమీపంలో పట్టాలపై ఓ వృద్ధుడి మృతదేహం గురువారం గుర్తించిన విషయం విదితమే. వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులు విస్తృతంగా ప్రచారం చేశారు. మరోవైపు పత్రికల్లోనూ వార్తలు ప్రచురితమయ్యాయి. మరణించిన వృద్ధుడు అనంతపురంలోని బిందెల కాలనీకి చెందిన చాకలి చెన్నరాయుడు అలియాస్ చెంద్రాయుడు(70)గా గుర్తించారు. మృతుడి భార్య ఐదేళ్ల కిందట మరణించింది. మృతుడికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. వారిలో ఇద్దరు అనంతపురంలో, మరొకరు శింగనమల మండలంలో నివాసం ఉంటున్నారు. అయితే తండ్రిని ఏ ఒక్క కొడుకూ ఆదరించకపోగా అనాథగా మిగిలిపోయాడు. అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సురేష్‌రెడ్డి అనే వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే. ఇందులో భాగంగా సురేష్‌రెడ్డి భార్య ధనలక్ష్మికి వైఎస్సార్ తక్షణ ప్రమాద బీమా కింద రూ.10 వేలు ఎంపీపీ హేమలత శుక్రవారం అందజేశారు. యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద కొండారెడ్డి, వన్నూరప్ప, సచివాలయ కన్వీనర్లు ఓబి టైలర్ వెంకటేష్, మురళి, శ్రీరామ్, వెల్ఫేర్ అసిస్టెంట్ భాను, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

'క్షణికావేశంలో నిర్ణయం తీసుకోరాదు'

అనంతపురం క్రైం: క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయం తీసుకోరాదని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటున్న ధోరణితో యువత ముందుకెళ్లాలని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ యండ్లూరి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని డాక్టర్ కేఎస్ ఏఆర్ గఫూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలై ఎక్కువ శాతం ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జీఎంసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఇన్‌స్టిట్యూట్ అధినేత డాక్టర్ అబ్దుల్ రజాక్, వైద్యులు డాక్టర్ అర్షద్ అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని డీ5 సెక్షన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేస్తుండడంతో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సోమనాథ్‌నగర్, ప్రశాంతినగర్, తపోవనం, ఏ నారాయణపురం, ఏఎస్‌ఆర్ నగర్, రంగస్వామినగర్, యువజనకాలనీ, రాయల్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

రోడ్లు ఆక్రమించకుండా చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఆదిమూర్తినగర్‌లో రోడ్డు ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: రోడ్లు, కాలువలు ఆక్రమణలు గురికాకుండా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అధికారులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ఆదిమూర్తినగర్‌లో రూ.32 లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కాలువలపై నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నగర ప్రజలు సైతం సామాజిక బాధ్యతగా రోడ్లు, కాలువలపై నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. నగరంలో ప్రధాన రోడ్ల విస్తరణ పనులు పూర్తయ్యాయని, రానున్న రెండు నెలల్లో అంతర్గత రోడ్ల పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, డివిజన్ కన్వీనర్ దాదు, ఏఈ కోమల తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ప్రభుత్వం అండ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. నగరంలోని మంగలవారి కాలనీకి చెందిన నాగ రాజు (25) ఈ ఏడాది జూన్ 17న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బును అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే నివాసంలో మృతుడి భార్య స్వామికి శుక్రవారం అందించారు. జేసీఎస్ కన్వీనర్ కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, నరసింహులు, లోకనాథ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ డిప్యూటీ ఆర్‌ఎంఓగా హేమలత

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి డిప్యూటీ ఆర్‌ఎంఓగా డాక్టర్ హేమలత బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు వద్ద ఆమె రిపోర్టు చేసుకున్నారు. కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ హేమలత డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. గతంలో ఈమె జీజీహెచ్‌లో చిన్నపిల్లల వైద్య నిపుణురాలుగా సేవలందించారు.

పేట్రేగిపోతున్న ఆక్రమణదారులు

- కొడిమి జగనన్న కాలనీలో దుక్కి దున్నిన వైనం
- రెవెన్యూ అధికారుల ఆదేశాలు బేఖాతర్



వారం రోజుల క్రితం ప్లాట్ల రాళ్లు, మట్టిరోడ్లను తొలగించి చదును చేసిన దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి జగనన్న కాలనీలో ఆక్రమణదారులు పేట్రేగిపోతున్నారు. కాలనీ కోసం ప్రభుత్వం ఈ భూములను చదును చేసి ప్లాట్లు వేసి, రాళ్లు నాటేందుకు, మట్టిరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసింది. అయితే ఈభూమిని కొందరు చదును చేయడంపై ఇటీవల రెవెన్యూ అధికారులు తీవ్రంగా స్పందించారు. ఇలాంటి భూములను కొందరు ఇటీవల చదును చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న రెవెన్యూ అధికారులు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఇప్పటికి వారం అయిపోయింది. అయినా వారిపై ఎలాంటి కేసులూ నమోదు చేయలేదు. చదును చేసిన భూములను ఇప్పుడు దున్నేశారు. మరొకరైతే ఏకంగా గడ్డి సాగు చేశాడు.

రెవెన్యూ సిబ్బంది అండతోనే...

అసైన్‌మెంట్ ద్వారా తీసుకున్న భూములను అమ్మినా, కొనుగోలు చేసినా చెల్లుబాటు కావు. కొడిమి జగనన్న కాలనీకి తీసుకున్న భూముల్లో 34 ఎకరాల భూములు అసైన్‌మెంట్ ద్వారా పొందిన వారి నుంచి ఇతరులు కొనుగోలు చేశారు.ఈ భూములపై ప్రస్తుతం ఉన్నవారికి ఎలాంటి హక్కు ఉండదని, వారివద్ద ఉన్న పాసు బుక్కులు చెల్లవని స్పష్టం చేశారు. ఎవరూ పంటలు పెట్టేందుకు వీలు లేదని కూడా చెప్పారు. పైగా ఇవన్నీ కూడా ఇటీవలే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ భూముల్లోకి ఎవరైనా బలవంతంగా వెళ్లినా చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అయినా కొందరు ఆ భూముల్లోకి వెళ్లి చదును చేయడం, సాగు చేయడం వంటివి చేస్తున్నారు. వీరికి కొందరు రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారు. ఇటీవల చదును చేసిన సమయంలో ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల ముందు పెద్ద గుండ్లను అడ్డంగా పెట్టారు. ఇప్పుడు వాటిని తీసేశారు కానీ దున్ని పంటలు పెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఆంజనేయులు

రాప్తాడు: విద్యార్థులందరికి చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో దాదాపుగా 10 ఉన్నత పాఠశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొని, తమ నైపుణ్యాలను ప్రదర్శించి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, హెచ్‌ఎం నరసింహులు, నియోజకవర్గ కన్వీనర్లు రాజశేఖర్ రెడ్డి, కేశవమూర్తి, మండల పీడీలు ముస్తాఫా, రవితేజ రెడ్డి, నారాయణ రెడ్డి, వీరన్న, సుల్తాన్, మల్లికార్జున, నాగరత్న, అనిల్, సీనియర్ క్రీడాకారులు ఆదినారాయణ, చైతన్య, నాగేష్, నరేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల వర్షాలు కురిశాయని, రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రూరల్ మండల ఏఓ శశికళ తెలిపారు. శుక్రవారం స్థానిక కృషి భవన్‌లో మండల స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఇందులో ఏవోతో పాటు అగ్రిబోర్డు చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కె.మల్లికార్జున, పశువైద్యులు డాక్టర్ శారద తదితరులు మాట్లాడారు. 80 శాతం రాయితీతో ఉలవలు, పెసలు, అలసంద, కొర్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 15లోపు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. పశుబీమా, రాయితీతో గడ్డిజొన్న విత్తనాలు, రాయితీతో గడ్డి కత్తిరించే యంత్రాలు (చాఫ్‌కట్టర్స్)ను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



- **స్వయం కృషి ఉంటే.. మోడు అయినా మొలవదా!**

చేతి వృత్తికి చెట్టు నీడకూ అవినాభావ సంబంధం ఉంటుందేమో.. చెట్టు నీడ ఉంటే పదిమంది సేదతీరుతారు.. చేతివృత్తి జరగాలంటే చెట్టు నీడ ఉండాలి. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ నుంచి శ్రీకంఠం సర్కిల్ మీదుగా ధర్మవరం వెళ్లే రోడ్డులో కృష్ణ థియేటర్ వంక మలుపు వద్ద చెట్టును ఇటీవల అభివృద్ధి పనుల్లో భాగంగా కొట్టేశారు. ఇన్నాళ్లూ స్థానికులు, వ్యాపారులు, పాదచారులకు నీడనిచ్చిన చెట్టు కాస్త.. మోడుగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు చిగురిస్తోంది. ఆచెట్టు నీడన చెప్పులు కుడుతూ జీవనం సాగించే ఓ వృద్ధుడు.. చెట్టు చిగురిస్తే నీడ వస్తుంది.. కాస్త చేతినిండా పనిదొరుకుతుందని మొద్దుకేసి ఆశగా చూస్తున్నాడు.



- **చక్కబెట్టుకోకుంటే తలకిందులే!**

ప్రతి ఒక్కరికీ తోడూనీడ ఉంటేనే జీవితం పదికాలాలపాటు సజావుగా సాగుతుందని నమ్మే మాట. అవసరానికి మనిషి తోడు ఉండాలి.. ఎండ కాసేటప్పుడు గొడుగునీడయినా ఉండాలి. లేకపోతే మనిషి వాలిపోతాడు. ఎండకు మాడిపోతాడు. నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో తోపుడు బండిపై కూరగాయలు విక్రయిస్తున్న మహిళ.. ఎండ వేడిమికి తాళలేక గొడుగు నీడ ఏర్పాటు చేసుకుంటే.. అదికాస్త గాలికి తిరగబడింది. గొడుగును చక్కబెట్టుకుంటే విరిగిపోతుందేమోనని ఆ మహిళ అలాగే వదిలేసినదృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



చిరుధాన్యలక్ష్మికళ

కలెక్టర్ పిల్లలు కలెక్టర్, హీరో పిల్లలు హీరో, రాజకీయ నాయకుడు పిల్లలు రాజకీయ నాయకులు కావాలని కోరుకుంటే, ఇక మధ్యతరగతి తల్లిదండ్రులు... తమలా తమ పిల్లలు ఇబ్బందులు పడకూడదని, తిని, తినక ఒక్కోరూపాయి పోగుచేసి, కష్టపడి చదివించి పిల్లలను విదేశాలకు పంపిస్తున్నారు. పంటలు పండించి అందరి ఆకలి తీర్చే రైతన్నలు మాత్రం తమ పిల్లలు తమలా రైతులు కావాలని అస్సలు కోరుకోవడం లేదు. ''పెద్దయ్యాక రైతును అవుతాను'' అని కూడా ఎవరూ చెప్పరు. ''మేము వ్యవసాయం చేస్తాం, ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాం. ఇప్పుడు ప్రపంచ దేశాధ్యక్షులు సైతం మేము చెప్పబోయేది ఆసక్తిగా వినబోతున్నారు అదీ వ్యవసాయం గొప్పతనం'' అని చాటిచెబుతున్నారు ఇద్దరు మహిళా రైతులు.

అవును గొప్పగొప్ప చదువులు చదివినవారి కంటే..తమ పూర్వీకుల నాటి నుంచి ఆచరిస్తోన్న పద్ధతులతో వ్యవసాయం చేస్తూ అందరి దృష్టి తమవైపు తిప్పుకున్న రైతులకు జీ–20 సదస్సుకు ఆహ్వానాలు అందాయి. పెద్దపెద్ద డిగ్రీలు, హోదాలు లేకపోయినప్పటికీ.. కేవలం వ్యవసాయం చేస్తున్నారన్న ఒక్క కారణంతో ... ప్రపంచ దేశాధ్యక్షులు పాల్గొనే 'జీ–20 సమితి'లో పాల్గొనే అవకాశం ఇద్దరు మహిళా రైతులకు దక్కింది. ఒడిశాకు చెందిన గిరిజన మహిళా రైతులు 'రైమతి ఘురియా, సుబాసా మోహన్తా' లకు ఈ అరుదైన గౌరవం లభించింది. సంప్రదాయ, గిరిజన చిరుధాన్యాల (మిల్లెట్స్) సాగు పద్ధతులను జీ–20 వేదికపై ఈ ఇద్దరు ప్రపంచ దేశాలకు వివరించనున్నారు.

కోరాపుట్ జిల్లాలోని నౌగుడా గ్రామానికి చెందిన రైతే 36 ఏళ్ల రైమతి ఘురియా. భూమియా జాతికి చెందిన రైమతికి ముగ్గురు పిల్లలు. మొదటి నుంచి వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తోంది. ఏళ్లపాటు వరిధాన్యాలు పండించే రైమతి... చిరుధాన్యాల సాగు మెళకువలు నేర్చుకుని మిల్లెట్స్ సాగు మొదలు పెట్టింది. అధునా తన సాంకేతికతను జోడించి పంటలో అధిక దిగుబడిని సాధిస్తోంది. సాగులోలేని 72 దేశీయ వరి రకాలు, ఆరు చిరుధాన్యాలతో కలిపి మొత్తం 124 రకాల ధాన్యాలను అంతరించిపోకుండా కాపాడుతోంది. మంచి దిగుబడితో సాధిస్తున్న రైతుగానే గాక, తోటి గిరిజన రైతులకు చిరుధాన్యాల సాగులో సాయం చేస్తూ వారికీ జీవనోపాధి కల్పిస్తోంది. సంప్రదాయ పంటలైన వరి, మిల్లెట్ రకాలను పండిస్తూనే తన గిరిజన మహిళలెందరికో ఆదర్శంగా నిలుస్తూ... మిల్లెట్ సాగును ప్రోత్సహిస్తోంది. పంటమార్పిడి, అంతర పంటలు, సేంద్రియ పంటల్లో తెగులు నివారణ మెళకువల గురించి, స్కూలును ఏర్పాటు చేసి ఏకంగా 2500 మంది రైతులకు శిక్షణ ఇచ్చింది. చిరుధాన్యాల సాగులో రైమతి చేసిన కృషికిగా గుర్తింపుగా అనేక ప్రశంసలు కూడా అందుకుంది. 2012లో జీనోమ్ సేవియర్ కమ్యునిటీ అవార్డు, 2015లో జమ్షెడ్జీ టాటా నేషనల్ వర్చువల్ అకాడమీ ఫెలోషిప్ అవార్డు, టాటా స్టీల్ నుంచి 'బెస్ట్ ఫార్మర్' అవార్డులే గాక, ఇతర అవార్డులు అందుకుంది.

> జీ20 సదస్సుకు హాజరవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. చిరుధాన్యాల సాగు, ఈ ధాన్యాల ప్రాముఖ్యత గురించి అందరికీ చెబుతాను. గిరిజన మహిళగా గిరిజన సాగు పద్ధతులను మరింత విపులంగా అందరికీ పరిచయం చేస్తాను.
> **- రైమతి ఘురియా**

చిరుధాన్యాల సాగులో అనుసరిస్తోన్న పద్ధతులు, దిగుబడి, తోటి రైతులను ఆదుకునే విధానమే రైమతిని జీ20 సదస్సుకు వెళ్లేలా చేసింది. ఈ సదస్సులో ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో వివిధ రకాల చిరుధాన్యాలు, ఈ ధాన్యాలతో చేసిన విభిన్న వంటకాలు, చిరుధాన్యాలతో వేసిన ముగ్గులను ప్రదర్శించనుంది. చిరుధాన్యాల సాగులో తాను ఎదుర్కొన్న పరిస్థితులు, అధిక దిగుబడి కోసం అవలంబిస్తోన్న విధానాలు వివరించనుంది. మిల్లెట్ సాగులో అనుసరించాల్సిన అధునాతన సాంకేతికత, దాని ఉపయోగాల గురించి ఎమ్ఎస్ స్వామినాథన్ రిసెర్చ్ సెంటర్ ఇచ్చిన శిక్షణ సంబంధిత అంశాలను ప్రస్తావించనుంది.

సుబాసా మొహన్తా

మయూర్‌భంజ్ జిల్లాలోని గోలి గ్రామానికి చెందిన చిరుధాన్యాల రైతే 45 ఏళ్ల సుబాసా మొహన్తా. తన జిల్లాలో ఎవరికీ చిరుధాన్యాల సాగుపై ఆసక్తి ఏమాత్రం లేదు. 2018లో ఒడిశా ప్రభుత్వం రైతులను చిరుధాన్యాల సాగు చేయమని మిల్లెట్ మిషన్‌ను తీసుకొచ్చింది. కానీ ఎవరూ ముందుకు రాలేదు. అలాంటి పరిస్థితుల్లో ధైర్యం చేసి ముందుకొచ్చింది సుబాసా. ఏళ్లనాటి గిరిజన సాగుపద్ధతులను ఉపయోగిస్తూ రాగుల సాగును ప్రారంభించింది. అప్పటి నుంచి మిల్లెట్స్‌ను పండిస్తూ అధిక దిగుబడిని సాధిస్తోంది. ఇది చూసిన ఇతర రైతులు సైతం సుబాసాను సాయమడగడంతో వారికి సాగు పద్ధతులు, మెళకువలు నేర్పిస్తూ మిల్లెట్ సాగును విస్తరిస్తోంది. సుబాసాను ఎంతో మంది గిరిజన మహిళలు ఆదర్శంగా తీసుకుని చిరుధాన్యాలు సాగుచేయడం విశేషం. సుబాసా కృషిని గుర్తించిన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవార్డులతో సత్కరించాయి.

> చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మంచిచేస్తాయి. ఇవి అనేక రకాల వ్యాధులు రాకుండా కాపాడతాయి. ఒకప్పుడు గిరిజనుల ప్రధాన ఆహారం చిరుధాన్యాలు. కానీ ఇప్పుడు పొలాల నుంచి దాదాపు కనుమరుగయ్యాయి. నేను ధాన్యాలు పండించడం మొదలు పెట్టిన తరువాత నన్ను చూసి చాలామంది రైతులు చిరుధాన్యాలు సాగుచేయడం ప్రారంభించారు. ఇతర రైతులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ, సలహాలు ఇస్తూ ప్రోత్సహించాను. వరికంటే చిరుధాన్యాల సాగులో అధిక దిగుబడులు వస్తుండడంతో అంతా ఈ సాగుకే ప్రాధాన్యం ఇస్తున్నారు.
> **- సుబాసా మోహన్తా**



మహిళా సాధికారతకు మార్గదర్శనం

పెద్ద ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కలలు కన్న షెఫాలికా పండా ఆ కలకు దూరమై పేదలకు దగ్గరైంది. మహాపట్టణం నుంచి మారుమూల పల్లె వరకు ఎన్నో ప్రాంతాలు తిరిగింది. తమ ఫౌండేషన్ తరఫున ఎంతోమందికి అండగా నిలబడింది. కష్టాలు, సమస్యల్లో ఉన్నవారికి సహాయం చేయడమే కాకుండా స్త్రీ సాధికారతకు సంబంధించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. 'జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటార్‌షిప్' కన్వీనర్‌గా స్త్రీ సాధికారతకు సంబంధించి విస్తృత స్థాయిలో పనిచేసే అవకాశం షెఫాలికా పండాకు లభించింది...

కాలేజీ రోజుల్లో 'సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్' కావాలని కలలు కనేది షెఫాలికా. అయితే ఒకానొక సంఘటనతో ఆమె కలల దారి మారింది. తమ బంధువు ఒకరు అనారోగ్యం పాలుకావడంతో, ఒడిషాలో సరియైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఢిల్లీకి తీసుకుపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి అసౌకర్యాల వరకు ఎన్నో సంఘటనలను దగ్గరగా చూసింది షెఫాలికా పండా.

'చదువుకున్న వారు, ఆర్థికంగా కాస్త మెరుగైన స్థితిలో ఉన్నవారి పరిస్థితే ఇలా ఉంటే ఒడిశాలోని మారుమూల ప్రాంతాలలో ఉండే పేద ప్రజల పరిస్థితి ఏమిటి?' అని ఆలోచించింది. ఆ ఆలోచనల ఫలితంగా సేవారంగంలోకి వచ్చిన షెఫాలికా ఎంతోమంది పేదలకు అండగా నిలబడింది.

బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవాకార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లింది.

'నాయకుల ఎదుగుదలకు సంబంధించి అనుభవం అనేది కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఎంత అనుభవం ఉంటే అంత బలం సమకూరుతుంది. సామాజిక సేవా రంగంలో పదహారు సంవత్సరాలుగా పనిచేస్తున్నాను. సమాజంలో సానుకూల మార్పు తేవాలనుకునేవారికి సమస్యను అర్థం చేసుకోవడంతో పాటు దానిపై పని చేయడానికి చాలా ఓపిక కావాలి. సామాజిక సేవలో మా అత్తమ్మ 'ఇలా పండా' నాకు ఆదర్శం. ఎలాంటి ఆడంబరం లేకుండానే ఎన్నో సంవత్సరాలు సేవ చేసింది. ఎండనకా, వాననకా తిరిగినా ఆమె ముఖంలో ఎప్పుడూ అలసట కనిపించేది కాదు. సామాజిక సేవ తన ఆరోగ్య రహస్యంగా చెప్పుకునేది. ఆమె చురుకుదనం, సామాజిక సేవాదృక్పథాన్ని చూసి ఎంతో మంది స్ఫూర్తి పొందారు. అందులో నేను ఒకరిని' అంటుంది షెఫాలికా.

'అవసరం ఉన్న చోట మేముంటాం' అనే నినాదంతో బన్సిధర్ అండ్ 'ఇలా పండా' ఫౌండేషన్ ట్రస్టీ, సీయివోగా ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టింది.

'మహిళలపై ప్రధానంగా దృష్టి పెట్టడానికి కారణం అసమానత, లింగ వివక్షత. మహిళల జీవితాలు మారాలంటే ఆమె పిల్లల జీవితాల్లో కూడా మార్పు రావాలని బలంగా నమ్ముతాను' అంటుంది షెఫాలికా.



> అవకాశాలు దొరికేవారు, దొరకని వారు అని మహిళలకు సంబంధించి రెండు రకాల వర్గీకరణలున్నాయి. అవకాశాలు దొరికేవారు సులభంగానే విజయం సాధించి పెద్ద స్థాయికి చేరుకుంటారు. మరి దొరకని వారి పరిస్థితి ఏమిటి? సాంకేతిక, జీవన నైపుణ్యాలు, చదువు రూపంలో అలాంటి వారిని వెలుగులోకి తీసుకువచ్చి, విజయపథంలోకి తీసుకువెళ్లడంపై, మహిళలకు సమాన అవకాశాలు ఎలా కల్పించాలనే దానిపై జీ20 సదస్సు దృష్టి పెడుతుంది. జీ20 ఉమెన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా వ్యాపారవేత్తలు కావాలనుకునేవారికి, ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఎంతో మేలు జరుగుతుంది. 30,000 మంది ఎంటర్‌ప్రెన్యూర్‌ల అనుభవాలు పాఠాలుగా ఉపయోగపడతాయి.
> **- షెఫాలికా,**
> కన్వీనర్, జీ20 ఎంపవర్ వర్కింగ్ గ్రూప్ ఆన్ మెంటర్‌షిప్

చెత్త ఏరుతూ ఎత్తుకు ఎదుగుతూ

* స్ఫూర్తి

మూసారాంబాగ్ సమీపంలోని సలీం నగర్‌లో తెల్లవారుజామున 'చెత్తబండొచ్చిందమ్మా' అని అరుస్తూ కనిపిస్తుంది జయలక్ష్మి. డిగ్రీ చదువుతూ తల్లి నడిపే చెత్తబండిలో సాయం చేస్తుంది జయలక్ష్మి. 'ఎదగాలనుకుంటే చెత్త నుంచి కూడా ఎదగొచ్చు' అంటుందా అమ్మాయి. తాను నివాసం ఉండే మురికివాడ పిల్లల కోసం ట్యూషన్లు చెబుతూ, వాలంటీర్‌గా పని చేస్తూ, ప్రతిష్ఠాత్మక 'గాంధీ - కింగ్ స్కాలర్లీ ఎక్స్చేంజ్ ఇనిషియేటివ్'లో భాగంగా జూన్‌లో అమెరికా వెళ్లి వచ్చింది జయలక్ష్మి. చిన్న చితకా సవాళ్లకే డీలా పడుతున్న యూత్‌కు జయలక్ష్మి ఇచ్చే స్ఫూర్తి చాలానే ఉంది.

యునైటెడ్ స్టేట్స్- ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (యు.ఎస్.ఐ.ఇ.ఎఫ్) వారి 'గాంధీ- కింగ్ ఎక్స్చేంజ్ ఇనిషియేటివ్' స్కాలర్‌షిప్ పొంది, అమెరికా వెళ్లి రెండు వారాల పాటు మార్టిన్ లూథర్ కింగ్ మార్గంలో అహింసా పద్ధతితో ప్రజా ఉద్యమాలు ఎలా నిర్వహించాలో అధ్యయనం చేసి రావడానికి దరఖాస్తులు కోరినప్పుడు మన దేశ వ్యాప్తంగా 4 వేల అప్లికేషన్లు వచ్చాయి. వారిలో కేవలం 10 మందిని మాత్రమే ఎంపిక చేస్తారు. ఆ పది మందిలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు ఉన్నారు. వారిలో ఒకరు అరిపిన జయలక్ష్మి.

హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ సమీపంలో అతి పెద్ద మురికివాడ- సింగరేణి కాలనీలో ఉంటూ, చెత్త బండి లాగుతూ చదువుకుంటున్న ఈ అమ్మాయి ఇలా అమెరికా వరకూ చేరుకోవడం సామాన్యం కాదు. పోరాడే తత్వం, సాధించాలనే పట్టుదల ఉండటం వల్లే ఇది సాధ్యమైంది. జయలక్ష్మిలోని అసాధారణమైన చొరవ, తపన ఆమెను ఇలా ముందుకు నడుపుతున్నాయి.



ముగ్గుపిండి అమ్మే దళిత కుటుంబం

అరిపిన జయలక్ష్మిది రాయలసీమ ప్రాంతానికి చెందిన దళిత కుటుంబం. తండ్రి రామ్మోహన్, తల్లి హుసేనమ్మ చిన్న వయసులోనే పెళ్లి చేసుకుని హైదరాబాద్ వలస వచ్చారు. వీరి ఇళ్లల్లో ముగ్గుపిండి అమ్ముకుని తరాలుగా జీవనం సాగిస్తున్నారు. అయితే జయలక్ష్మి తల్లిదండ్రులు చెత్తబండి నడపడాన్ని ఉపాధి చేసుకున్నారు. 'అమ్మ ఒక బండి, నాన్న ఒక బండి నడుపుతారు. కాలనీ వాళ్ల నెలకు ఇంతని ఇచ్చే డబ్బులే మాకు జీవనాధారం. గవర్నమెంట్ నుంచి ఏమీ జీతం రాదు. చెత్త తీయడం చాలా కష్టమైన పని. నాన్న తానొక్కడే చెత్త తీయగలిగినా అమ్మకు కష్టమని నేను ఏడో క్లాస్ నుంచి ఇవాళ్టి వరకూ ఆమెకు తోడు వెళుతూనే ఉన్నాను. చెత్త సేకరించడం, తడిచెత్త పొడిచెత్త వేరు చేయడం, డంపింగ్ యార్డ్‌లో పడేయడం అన్నీ చేస్తాను. ఇది చాలా దారుణమైన పని అని కొందరు అంటారు. కాని నా మటుకు నాకు ఇది అన్నం పెట్టే వృత్తి. నేను దానిని గౌరవిస్తాను. మా ఇంట్లో నేను కాకుండా అన్నయ్య, చెల్లెలు ఉన్నారు. అందరూ మంచిగా చదువుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని మా అమ్మ తపన. అంతవరకు ఈ పని చేయకతప్పదు' అంటుంది జయలక్ష్మి.


బండిలో చెత్త వేస్తున్న జయలక్ష్మి

ఎన్.జి.ఓ దృష్టిలో పడి

జయలక్ష్మి చిన్నప్పటి నుంచి చురుగ్గా ఉండేది. కాలనీలోని సమస్యలపై మాట్లాడేది. స్కూల్లో ఒకసారి ఇలాగే మాట్లాడితే 'మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్' అనే ఎన్.జి.ఓ దృష్టిలో పడింది. పేదవర్గాల కోసం పని చేసే ఆ సంస్థ జయలక్ష్మిని తన కార్యకలాపాల్లో భాగం చేస్తూ ప్రోత్సహించింది.

'స్లమ్స్‌లో ఉండే పిల్లల వికాసం కోసం నేను పని చేశాను. హైదరాబాద్‌లో 56 స్లమ్స్ ఉంటే వాటిలో 21 చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు లేవు. మేమందరం మహిళా సంక్షేమ శాఖ దగ్గరకు వెళ్లి మాట్లాడి వాటిని సాధించాం' అంటుంది జయలక్ష్మి. ఇంగ్లిష్ మీడియంలో చదవాలనుకుని తన వాడ నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి చదువుకున్న జయలక్ష్మి తన వాడలోని పిల్లలకు సాయంత్రాలు ట్యూషన్ చెప్తూ వారి చదువుకు మేలు చేస్తోంది. 'కోవిడ్ సమయంలో మా కాలనీలో నేను కార్యకర్తగా పని చేశాను. కోవిడ్ రాకుండా చాలా వరకు సక్సెస్ అయ్యాను' అంది.

ఐ.ఏ.ఎస్ కావాలని

'యువతకు నాయకత్వ లక్షణాలు ఉండాలి. హక్కుల కోసం పోరాడాలి. అమెరికాలో శాంతియుత పోరాటాల విజయగాథలను అధ్యయనం చేయగలగడం నా అదృష్టం. ఒక యువ ప్రతినిధిగా పోరాడుతూనే ప్రజల సేవ కోసం ఐ.ఏ.ఎస్ సాధించాలనుకుంటున్నాను. అందుకు కావలసిన సహాయం పొందగలననే అనుకుంటున్నాను. నాకు ఎంతమంచి పేరున్నా చెత్త అమ్మాయి అనే పిలుస్తారు కొందరు. వారి చేత ఉత్తమ అమ్మాయి అనిపించుకునేందుకు, లక్ష్యం లేని వారి బుర్రలే చెత్త అని నిరూపించేందుకు మరింత కష్టపడతాను' అంది జయలక్ష్మి.

– సాక్షి ఫీచర్స్ డెస్క్


* సందర్భం

పక్షులతో ప్రయాణం

ఛాయాచిత్ర ప్రేమికుడు జి.వి. ప్రసాద్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ


జి.వి. ప్రసాద్

ఒక ఫొటో వెయ్యి పదాలకు సమానం. పక్షులు, వన్యప్రాణుల ఫొటోలు తీయాలంటే, గంటల కొద్దీ వేచి చూడాలి. వాటి ప్రశాంతతకు భంగం కలగకుండా ఫొటోలు తీయడం కత్తిమీద సాములాంటిదే. పారిశ్రామికవేత్త, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. ప్రసాద్‌కి మాత్రం అది ఆట విడుపు. ఆయన దేశ విదేశాల్లో పర్యటించి తీసిన ఫొటోలతో ఇటీవల 'ది బర్డ్స్ అండ్ బిలీఫ్స్' పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా... సాక్షితో సంభాషణ.



■ **ఔషధాల తయారీ రంగంలో తీరిక లేకుండా ఉండే మీకు, పక్షుల కోసం పర్యటనలు, ఫొటోగ్రఫీ హాబీ ఎప్పటి నుంచి?**

గత పది, పదిహేనేళ్లుగా ఫొటోగ్రఫీ చేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా పర్యటించి, స్వయంగా తీసిన ఫొటోల సమాహారమే ఈ పుస్తకం. కొన్ని ఫొటోలతో పుస్తకాన్ని తీసుకురావాలని, మరికొన్నింటితో ప్రదర్శన ఏర్పాటు చేయాలని నా ఆలోచన. గతంలో రెండు పుస్తకాలు ప్రచురించాను. ఒకటి అలాస్కా మీద, మరొకటి స్పితి వ్యాలీ. ఇది మూడో పుస్తకం.

■ **'బర్డ్స్ అండ్ బిలీఫ్స్' లో మంచి కొటేషన్‌లు కూడా కనిపిస్తున్నాయి!**

నన్ను ప్రభావితం చేసే సూక్తులు కనిపించినప్పుడు, విన్నప్పుడు పుస్తకంలో రాసుకోవడం నాకు పాతికేళ్లుగా అలవాటు. వాటిలో కొన్నింటిని ఇందులో పొందుపరిచాను. ఈ పుస్తకం నా అభిరుచికి, జ్ఞాపకాలకు నిలువుటద్దం.

■ **ఇందులో ఏఏ ప్రదేశాల పక్షులున్నాయి?**

మనదేశంలో దక్షిణాదిలో హైదరాబాద్, ఉత్తరాది నుంచి భరత్‌పూర్, కాన్హా నేషనల్ పార్క్. ఆఫ్రికా ఖండంలో కెన్యా, టాంజానియా, బొట్సువానా, నార్త్ ఆర్కిటిక్, అంటార్కిటికా తదితర ప్రాంతాల పక్షుల ఫొటోలున్నాయి. అంటార్కిటికాలో పెంగ్విన్స్ కూడా తీశాను. నార్త్ అమెరికాలో అలాస్కా కూడా కవర్ చేశాను. ఈ ప్రాంతాలలో కనిపించే పక్షులతో పాటు క్షీరదాలు, ప్రకృతి ఫొటోలూ తీశాను. కానీ, ఈ పుస్తకాన్ని మాత్రం పక్షుల కోసమే కేటాయించాను.

■ **వలస పక్షులు భారీగా వచ్చే ఆంధ్రప్రదేశ్, పులికాట్ సరస్సుకు వెళ్లారా?**

వెళ్లాను, ఫ్లెమింగో ఫొటోలు తీశాను. కానీ ఈ పుస్తకంలో ప్రచురించలేదు.



■ **బర్డ్ వాచింగ్ కోసం విభిన్నమైన అనేక ప్రాంతాలను సందర్శించారు. మీకు బాగా నచ్చిన ప్రదేశం, సందర్భం, ఫొటో ఏది?**

అలాస్కాలో ల్యాండ్ స్కేప్‌లు, మంచినీటి సరస్సులు, ఉప్పు నీటి చెరువులు, పొరలు పొరలుగా పేరుకుపోయిన మంచు... మొత్తంగా చూస్తే ప్రకృతి అద్భుతంగా స్ఫూర్తిదాయంగా అనిపిస్తుంటుంది. పెద్ద ఎలుగుబంట్లు, బాల్డ్ ఈగల్స్, సాల్మన్ చేపలతోపాటు రకరకాల చేపలుంటాయి. సముద్రం నుంచి మంచి నీటి సరస్సుల వైపుకు గుంపులుగా వచ్చే చేపల్ని చూడడం వర్ణించలేనటువంటి అనుభూతి. అలాగే మరొకటి... ఆఫ్రికాలో ప్రాణులు వలస వెళ్లడం. వైల్డ్ బీస్ట్ పెద్ద సంఖ్యలో నదిని దాటుతున్న దృశ్యం ఇప్పటికీ కళ్లముందు కదలాడుతోంది.

■ **ఆర్నిథాలజిస్టు ఆశిష్, కెమెరా మెళకువలు నేర్పిన సురేశ్ చిత్తూరి గురించి మీ పుస్తకంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు!**

ఆశిష్‌తో చాలా ఏళ్ల పరిచయం. వాళ్ల పిల్లలు, మా పిల్లలు క్లాస్‌మేట్స్. బర్డ్ వాచింగ్‌ను పరిచయం చేసింది ఆయనే. ఇక శ్రీనివాస హ్యాచరీస్ సురేశ్ చిత్తూరి కూడా నాకు మంచి మార్గదర్శి.

■ **ఎన్నిరకాల పక్షులను ఫొటో తీశారు?**

రెండువందలకు పైగా పక్షి జాతులను ఫొటో తీశాను.

■ **మీ పుస్తకంలో పాలపిట్ట, కాకి, కోకిల కనిపించాయి. కానీ రామచిలుక కనిపించలేదు! అలాగే కొల్లేటి కొంగలు, చిల్కా సరస్సులో విహరించే పక్షులను మేము తర్వాతి పుస్తకంలో చూడవచ్చా?**

రామచిలుకల ఫొటో తీశాను. కానీ, పుస్తకానికి ఫొటోల ఎంపికలో వదలిపెట్టాను. కొల్లేరు వెళ్లలేదు. చిల్కా సరస్సుకు వచ్చే ఏడాది వెళదామనుకుంటున్నాను.

శాస్త్రీయతకు గౌరవం

డాక్టర్ రెడ్డీస్ సంస్థలో 1990 నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్న జీవీ ప్రసాద్ ఆ సంస్థ ఎదుగుదల, 66 దేశాలకు విస్తరణలో తనవంతుగా విశేషమైన కృషి చేశారు. సశాస్త్రీయమైన పరిశోధనల పరంపరలో ఆయనను వరించిన కొన్ని ప్రత్యేక గుర్తింపులు... పురస్కారాలివి.

- వైపీఓ గ్లోబల్ ఇంపాక్ట్ అవార్డు- 2020
- వి. కృష్ణమూర్తి అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ బై ద సెంటర్ ఫర్ ఆర్గనైజేషనల్ డెవలప్‌మెంట్, 2019
- బౌండరీ బ్రేకర్ లీడర్ అవార్డ్, సీఈఓ అవార్డ్స్ 2018
- ఇండియా బిజినెస్ లీడర్ ఆఫ్ ద ఇయర్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2015
- ఇండియాస్ బెస్ట్ సీఈవో బై బిజినెస్ టుడే, 2014
- ఇండియా టాలెంట్ మేనేజ్‌మెంట్ అవార్డ్ బై సీఎన్‌బీసీ ఆసియా, 2014

■ **మీ నేపథ్యం మొత్తం హైదరాబాదేనా?**

లేదు, పాక్షిక హైదరాబాదీని. నాల్గవ తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాను. తర్వాత నెల్లూరులో 12వ తరగతి వరకు, రెండున్నరేళ్లు చెన్నై అన్నా యూనివర్సిటీ, ఆ తర్వాత చికాగోలో ఇలినాయీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో కెమికల్ ఇంజినీరింగ్, మాస్టర్స్ పర్‌డ్యూ (Purdue University) యూనివర్సిటీలో పూర్తి చేసి హైదరాబాద్‌కి వచ్చాను.

■ **పుస్తకం విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని వన్యప్రాణుల సంరక్షణ కోసం విరాళమని ప్రకటించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వం తగినంత శ్రద్ధ చూపట్లేదని అనుకుంటున్నారా?**

ప్రభుత్వం వన్యప్రాణుల సంరక్షణకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తోంది. కానీ, ప్రభుత్వం ఒక్కటే అన్నింటినీ పరిష్కరించలేదు. వ్యక్తుల విరాళాలు చాలా ఉపయోగ పడతాయి. పర్యావరణం, వన్యప్రాణుల పరిరక్షణ ముఖ్యమైన అంశం అని నేను మద్దతు ఇస్తున్నాను. ఆన్‌లైన్‌లో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయిస్తున్నాం. పుస్తక విక్రయాలతో వచ్చే డబ్బు నాకవసరం లేదు. ఉచితంగా ఇస్తే పుస్తకం గౌరవం తగ్గిపోతుంది. అందుకే విక్రయాలను మంచి పనికి విరాళంగా ఇవ్వాలనుకున్నాను.

■ **అంజిరెడ్డి (డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ వ్యవస్థాపకులు)గారు చెప్పినట్లుగా మన కుండ నిండిన తర్వాత, అదనంగా వచ్చి పడుతున్న నీటిని మరొకరికి ఉపయోగపడేలా చేయాలి అనే సూత్రాన్ని పాటిస్తున్నారా? ఆయన నుంచి అలాగే మీ నాన్నగారి నుంచి మీరు నేర్చుకున్నదేమిటి?**

మా నాన్నగారు (గ్రీన్ పార్క్ హోటల్ వ్యవస్థాపకులు) చాలా డీటెయిల్ ఓరియెంటెడ్. మనం చేస్తున్న పని గురించి సూక్ష్మ స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెబుతారు. వివరాలన్నీ సమగ్రంగా తెలుసుకున్న తర్వాతే మాట్లాడేవారు. మా మామగారు (అంజిరెడ్డి) విజన్ చాలా విస్తృతమైనది. వారిద్దరినీ ఒకే 'ఫ్రేమ్'లో చెప్పాలంటే... 'అడవి అందులో చెట్లు' అని చెప్పవచ్చు. అంజిరెడ్డి గారి ద్వారా అడవిని చూస్తే, మా నాన్న గారి ద్వారా అందులో వృక్షాలను చూశాను.

■ **పాఠకులకు మీరు ఇచ్చే సందేశం ఏమిటి?**

'ప్రపంచంలోని ప్రతిదీ ప్రకృతితో ముడిపడి ఉంటుంది. మన ఆరోగ్యం అడవి ఆరోగ్యంతో ముడిపడి ఉంది. మన శ్రేయస్సు కోసం ప్రకృతి పరిరక్షణ తప్పనిసరి' అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరూ 'కొంతవరకైనా ప్రకృతితో మమేకమవుదాం' అనుకుంటే... ప్రకృతి పరిరక్షణ కోసం చేయగలిగిన చిన్న చిన్న పనులు అందరమూ చేయగలుగుతాం.

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి